క్లుప్తంగా

ప్రత్యేక వైద్యశిబిరం



పరీక్షలు చేయించుకుంటున్న మండల ప్రత్యేక అధికారి సాల్మన్ రాజు

బొండపల్లి: డెంగీ నివారణ వారోత్సవాల సందర్భంగా మండలంలోని దేవుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని మండల ప్రత్యేక అధికారి ఏవీ సాల్మన్‌రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తులసీనాథ్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తారురోడ్డు వేయరూ..



తారురోడ్డుగా మార్చాల్సిన తమటాడ - బిల్లలవలస రహదారి

బొండపల్లి: మండలంలోని తమటాడ – బిల్లలవలస గ్రామాలకు తారు రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రెండు గ్రామాల మధ్య సుమారు కిలోమీటర్ దూరం ఉన్న మట్టి రోడ్డును తారురోడ్డుగా మార్చాలని వాహన చోదకులు కోరుతున్నారు. ప్రస్తుతమున్న రహదారిపై రాకపోకలు ఇబ్బందిగా మారాయని, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎల్.కోటలో భారీ వర్షం



రంగారాయపురంలో నువ్వు పంటలో చేరిన నీరు

లక్కవరపుకోట: మండలంలోని పలు గ్రామాల్లో భారీ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం శనివారం కురిసింది. లక్కవరపుకోట, రంగారాయపురం, సంతపేట, సీతారాంపురం, గొల్జాం, కళ్లేంపూడి, తదితర గ్రామాల్లో సాగులో ఉన్న నువ్వు పంటలో భారీగా నీరు చేరింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. నువ్వు పంటతో నాలుగు డబ్బులు కళ్లజూద్దామన్న అన్నదాతల ఆశలు అడియాసలయ్యాయి.

ప్రభుత్వ వసతిగృహాల తనిఖీ



బీసీ హాస్టల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక వసతిగృహం, ప్రభుత్వ గిరిజన వసతిగృహం, బీసీ వసతిగృహంతో పాటు సబ్‌జైల్‌ను స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి కనకలక్ష్మి మాట్లాడుతూ.. బాలికల సాంఘిక సంక్షేమ వసతిగృహం మినహాయిస్తే మిగిలిన అన్ని వసతిగృహాలు అధ్వాన స్థితిలో ఉన్నాయని చెప్పారు. ఇక్కడ పరిస్థితులను జిల్లా న్యాయ సేవాసంస్థకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ..



కౌలు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న ఏఓ అనురాధ

దత్తిరాజేరు: అర్హత ఉన్న కౌలు రైతులకు ప్రత్యేక కార్డులు మంజూరు చేసి ప్రభుత్వ రాయితీలు కల్పిస్తామని ఏఓ అనురాధ అన్నారు. శనివారం స్థానిక సచివాలయంలో కౌలురైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌలు రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు అందివ్వడంతో పాటు బ్యాంక్ రుణాలు కూడా మంజూరు చేస్తామన్నారు. అనంతరం కౌలు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు.

కొత్త కార్డులకు తప్పని తిప్పలు..

మెరకముడిదాం: కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునే వారికి తిప్పలు తప్పడం లేదు. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వం ఎట్టకేలకు కొత్త రేషన్‌కార్డులకు అవకాశం కల్పించింది. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అయితే సచివాలయల్లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాల్సిన సిబ్బంది సరిగా లేకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే సర్వర్ కూడా బీజీగా ఉండడంతో దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయాల చుట్టూ లబ్ధిదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. మండల అధికారులు ఇప్పటికైనా స్పందించి సచివాలయల్లో సిబ్బందిని అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

వంద కొడితేనే.. గరిష్ట వేతనం

- వేతనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది
- వారానికి వంద ఇస్తేనే.. గరిష్ట వేతనం
- లేనిపక్షంలో వేధింపులు తప్పవు
- మండలం నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు వాటాలు



గోషాడలో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులు (ఫైల్)

గుర్ల: ఉపాధి హామీ పథకానికి సంబంధించిన అధికారులు, సిబ్బంది చేతివాటం కనబరుస్తున్నారనే విమర్శలు మండలంలో జోరుగా వినిపిస్తున్నాయి. తమకు నగదు ఇస్తే ఒకలా.. లేకపోతే మరోలా వ్యవహరిస్తున్నారు. మండలంలోని 42 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఉపాధి సిబ్బంది వేతనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. గ్రామాలకు చెందిన మేట్లు నగదు వసూలు చేసి అధికారులకు ముట్టజెబుతున్నారు. ఎవరైనా వేతనదారులు ఎందుకు డబ్బులివ్వాలని ప్రశ్నిస్తే.. పని తక్కువగా చేస్తున్నారని, ఇకపై పని కల్పించమని బెదిరిస్తూ తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారు. వారానికి రూ. వంద ఇస్తే తక్కువ పని చేసినప్పటికీ టెక్నికల్ అసిస్టెంట్ సహాయంతో కొలతలను అధికంగా వేసి ప్రభుత్వం ప్రకటించిన గరిష్ట వేతనాన్ని మీ ఖాతాలో జమయ్యేలా చేస్తామని వేతనదారులను నమ్మిస్తున్నారు. ఇదే అదునుగా గ్రామాల్లో పనులకు రాని వారికి సైతం మస్తర్లు వేసి ఆ నగదును మేట్లు తీసుకుంటున్నారు.

పర్యవేక్షణ కరువు

మండలంలోని 42 పంచాయతీలలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి వేతనదారులకు గరిష్ట వేతనం వచ్చే పనులు అప్పగించాలి. పైగా ఆ పనులను దగ్గరుండి పర్యవేక్షించాలి. కాని వేతనదారుల దగ్గర నుంచి నగదు తీసుకుంటున్న సిబ్బంది పనుల వద్దకు వెళ్లకుండా ఇంటి వద్ద నుంచే పర్యవేక్షణ చేస్తున్నారు.

అంతా ఆయనే...

ఉపాధి పథకంలో దాదాపు పది గ్రామాలకు టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన అన్నీ తానై అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని 42 పంచాయతీలలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లపై అజమాయిషీ చెలాయిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. కనీసం ఏపీఓ మాట కూడా చెల్లుబాటు కావడం లేదంటే ఈయన హవా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నెలకు రూ. కోటి పైనే వసూలు..

మండలంలోని 42 పంచాయతీలలో 19,548 జాబ్ కార్డులున్నాయి. మొత్తం 34,711 మంది వేతనదారులు పనుల కోసం దరఖాస్తు చేసుకోగా.. ప్రస్తుతం 32,775 మంది పనులు చేస్తున్నారు. వీరందరి నుంచి వారానికి వంద చొప్పున అంటే సుమారు రూ. 30 లక్షలు.. నెలకు కోటి రూపాయలకు పైనే వసూలు చేస్తున్నారు. ఇలా వచ్చిన నగదు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులకు వరకు వెళ్తున్నట్లు సమాచారం.

నా దృష్టికి రాలేదు..



గ్రామాల్లో ఉపాధి హామీ వేతనదారుల నుంచి వారానికి వంద రూపాయలు వసూలు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. ఉపాధి హామీ పనులను తరుచూ పర్యవేక్షిస్తున్నాం. ఎటువంటి అవకతవకలు జరిగినా బాధ్యులపై చర్యలు తప్పవు.

– సూర రత్నమాల, ఏపీఓ, గుర్ల

చలివేంద్రం ఏర్పాటు..



బొండపల్లి మండల సముదాయం వద్ద తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యాలయాలకు వచ్చే వారితో పాటు జాతీయ రహదారి మీదుగా ప్రయాణాలు సాగించే వారి కోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరరావు, ఆర్ఐ జీవీ హరికృష్ణ, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. – బొండపల్లి

సన్మానం..



మెరకముడిదాం మండలంలోని భైరిపురంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరామచంద్ర సామ్రాజ్య పట్టాభిషేకంలో పాల్గొన్న వేద పండితులకు వైస్ ఎంపీపీ కందుల మల్లికార్జునరావు శనివారం ఘనంగా సత్కరించారు. అనంతరం వేదపండితులు మల్లికార్జునరావు దంపతులను వేద మంత్రాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. – మెరకముడిదాం

బాలభవన్‌లో అవగాహన

చీపురుపల్లి: పట్టణంలోని బాలభవన్ కేంద్రంలో విద్యార్థులకు శ్రీమద్భగవద్గీతతో పాటు నైతిక విలువలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని కొత్త గవిడివీధికి చెందిన గీతా మందిరం ప్రతినిధులు ప్రకాశనంద స్వామి, వెంకటరావు పాల్గొని నైతిక విలువలపై వివరించారు. అలాగే ప్రతిఒక్కరూ మద్భగవద్గీత చదవాలని తద్వారా ఎంతో విజ్ఞానం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ డాక్టర్ సుంకరి రమేష్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలతో విజ్ఞానం

- ఎంపీడీఓ ఎంవీజీ సుబ్రహ్మణ్యం



చిన్నారులకు సూచనలు అందిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, తదితరులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): వేసవికాలంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలు విజ్ఞానానికి దోహదం చేస్తాయని ఎంపీడీఓ ఎంవీజీ సుబ్రహ్మణ్యం అన్నారు. గరివిడి శాఖా గ్రంథాలయంలో శనివారం సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎం. ఉషారాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు బీట్ ద హీట్ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. విద్యార్థులు తరుచుగా క్విజ్ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. వేసవికాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పి.రామారావు, ఏపీఎం పి.నారాయణరావు, ఏపీఓ కనకరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పాపారావు పాల్గొన్నారు.

యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోండి

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో గల సత్యసాయి కల్యాణ మంటపంలో పది రోజులు ధ్యాన, ఆరోగ్య యోగా శిక్షణ శిబిరం నిర్వహించనున్నామని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సూరి గురుజీ ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈ నెల 19 నుంచి పది రోజులు శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

ప్రతి రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7 వరకు.. సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో అమృత ఆహారం అందించనున్నట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

- డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి

చీపురుపల్లి: ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి ఆదేశించారు. శనివారం చీపురుపల్లి వచ్చిన ఆమె స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేదలంతా ఏరియా ఆస్పత్రిని ఆశ్రయిస్తుంటారని, ఈ నేపథ్యంలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. రిఫరల్ కేసుల సంఖ్యను తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తి అలవర్చుకోవాలి..



పేదలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ప్రతి ఒక్కరూ దైవ భక్తిని అలవర్చుకోవడంతో పాటు ఉన్నంతలో ఇతరులకు సేవ చేయాలని ఎమ్మెల్యే కమిడి కళా వెంకటరావు అన్నారు. పట్టణంలోని రామేశ్వరకాలనీలో గల సత్య సాయిబాబా ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేదలకు చీరలు, గొడుగులు, అమృత కలశాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైల బలరాం, బలగం వెంకటరావు, సారిపాక సురేష్, రెడ్డి గోవింద్, సత్యసాయి భజనా మండలి కన్వీనర్ రాము, సభ్యులు వాండ్రంగి వెంకటేష్, సత్యారావు, రాము, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామానికి చెందిన సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్ తన తాత పెద్దకర్మ సందర్భంగా శనివారం గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ వారు 15 యూనిట్ల రక్తం సేకరించారు. అనంతరం 50 మంది పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విచారణ



విచారణ చేపడుతున్న ఏపీఓ సుందరరావు

గంట్యాడ: మండలంలోని పెదవేమలికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ వి. శ్రీనివాస్‌రావుపై శనివారం విచారణ చేపట్టారు. ఉపాధి వేతనదారులకు పని కల్పించడం లేదని సర్పంచ్ వి. పాపునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదవేమలి సచివాలయంలో ఏపీఓ గర్భాపు సుందరరావు విచారణ చేపట్టారు. విచారణ నివేదికను డ్వామా పీడీకి పంపిస్తామని ఆయన తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

- ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక



మండల పరిషత్ కార్యాలయం సమీపంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, ప్రమీలా గాంధీ, తదితరులు

గజపతినగరం: పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మొక్కలను పెంచడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని అధికారులకు సూచించారు. మండలంలోని అన్ని పంచాయతీలకు నేరేడు, బాదం, కాము, తదితర మొక్కలు పంపిణీ చేశామని, వాటిని పంచాయతీ అధికారులు, సిబ్బంది నాటాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషలాఫీసర్ ప్రమీలా గాంధీ, మండల స్పెషలాఫీసర్ రమేష్‌కుమార్, ఎంపీడీఓ బి.కల్యాణి, స్థానిక తహసీల్దార్ బి.రత్నకుమార్, మండల వ్యవసాయశాఖాధికారి ధనలక్ష్మి, ఆర్ఐ అప్పలరాజు, ఈఓపీఆర్‌డీ సుగుణాకరరావు, పంచాయతీ ఈఓ జనార్దనరావు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం..

బొండపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం కార్యాలయాల ఆవరణల్లో ఇంకుడు గుంతలు తవ్వారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఏవీ సాల్మన్‌రాజు, ఎంపీడీఓ తులసీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

దత్తిలో..

దత్తిరాజేరు: పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ రుక్సానా బేగం అన్నారు. మండలంలోని దత్తి గ్రామంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టాలని ఈఓపీఆర్‌డీ వాణిశ్రీని ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత..

గుర్ల: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. మండల కేంద్రంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడు వ్యాధులు ప్రబలవన్నారు. అనంతరం గుర్ల ప్రధాన రహదారిపై చలివేంద్రం ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాల, సచివాలయం వద్ద మొక్కలు నాటారు. అలాగే స్థానిక ఏఎన్ఎం, ఆశా వర్కర్స్, క్లాప్ మిత్రులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, మండల ప్రత్యేకాధికారి పెంటోజీరావు, జెడ్పీ సీఈఓ బి.సత్యనారాయణ, డీపీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శేషుబాబు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ..

లక్కవరపుకోట /కొత్తవలస / వేపాడ: మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఎల్.కోట తహసీల్దార్ ప్రసాదరావు అన్నారు. లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ మండలాల్లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎల్.కోట తహసీల్దార్ ప్రసాదరావు, వేపాడ మండల ప్రత్యేధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



బొండపల్లి: ఇంకుడు గుంతలకు శ్రీకారం చుడుతున్న ఎంపీపీ చలం నాయుడు, మండల ప్రత్యేక అధికారి సాల్మన్‌రాజు



గుర్ల: ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, అధికారులు



లక్కవరపుకోట: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్క నాటుతున్న తహసీల్దార్ ప్రసాదరావు



కొత్తవలస: ఎంఆర్‌సీ భవనం వద్ద మొక్కకు నీరు పోస్తున్న ఎంఈఓ జి.శ్రీదేవి

గరివిడిలో..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి పట్టణం కొండపాలెం మేజర్ పంచాయతీలోస్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, ఎంపీడీఓ ఎంవీజీ సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖాధికారి పి.రామరావు, మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగమణి, పంచాయతీ ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, ఎంపీటీసీ సభ్యుడు ఎడ్ల సూర్యారావు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వాడవాడలా..

మెరకముడిదాం: మండలంలోని పలు పంచాయతీల్లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సాతాంవలసలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ జి.భాస్కరరావుతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొని మొక్కలు నాటారు. అలాగే చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ విశ్వనాథం, ఏపీఎం ధనలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, గ్రామపెద్దలు రామశివ, కృష్ణరాజు పాల్గొన్నారు.

వేసవి నుంచి రక్షణకు..

చీపురుపల్లి: వేసవి నుంచి రక్షణకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి అన్నారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, మండల ప్రత్యేక అధికారి ఎం.రాజేశ్వరి, ఎంపీడీఓ ఎల్.త్రినాథరావు, తహసీల్దార్ రాజారావు, ఈఓపీఆర్‌డీ సురేష్, పంచాయతీ అధికారి ఝాన్సీరాణి, బాణాన శ్రీనివాసరావు, ఇప్పిలి తిరుమల, గవిడి సురేష్, ప్రభాత్, తదితరులు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: దత్తి సచివాలయం వద్ద మొక్క నాటుతున్న మండల ప్రత్యేక అధికారి రుక్సానా బేగం



వేపాడ: అరిగిపాలెంలో మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, తదితరులు



చీపురుపల్లి రూరల్: మొక్క నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మెరకముడిదాం: సాతాంవలసలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ భాస్కరరావు, గ్రామపెద్దలు, అధికారులు



చీపురుపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



గంట్యాడ: ర్యాలీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

రామవరంలో..

గంట్యాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పీరుబండి పద్మ, సీడీపీఓ ఉమాభారతి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, పాల్గొన్నారు.